RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 305 | 26 శనివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## ఆరోగ్యశ్రీ సాయంతో కోలుకున్న చిన్నారి

**విజయవాడ, రాజధాని వాయిస్ :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గన్నవరం విమానాశ్రయంలో నూజివీడు నియోజకవర్గంలోని కొర్లగుంట గ్రామానికి చెందిన మహేష్, వినీల దంపతులు తమ కుమార్తె ధన్సికతో కలిసి కలిశారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిన వైద్య సహాయాన్ని గుర్తు చేసుకుంటూ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ గతంలో ఎదుర్కొన్న కష్టాలను ఆయనతో పంచుకున్నారు. తల్లిదండ్రులు వివరించిన ప్రకారం, 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే తమ కుమార్తె ధన్సిక తీవ్ర అనారోగ్యానికి గురైందన్నారు. అప్పటికి ఆమె వయస్సు కేవలం రెండు నెలలేనని తెలిపారు. చిన్నారి పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని చెప్పారు. ఆ సమయంలో వైద్యుల సూచన మేరకు అత్యవసర శస్త్రచికిత్స అవసరమైందని వివరించారు. ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద చిన్నారికి క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్స ఉచితంగా నిర్వహించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. సాధారణంగా భారీ వ్యయం అయ్యే ఆ చికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పొందగలిగామని పేర్కొన్నారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో తమ కుమార్తె ప్రాణాపాయం నుంచి బయటపడిందని చెప్పారు. ప్రభుత్వ వైద్య సహాయం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని వివరించారు. ఆపరేషన్ అనంతరం ధన్సిక పూర్తిగా కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా పెరుగుతోందని మహేష్, వినీల దంపతులు జగన్‌కు వివరించారు. తమ కుమార్తె సాధారణ పిల్లల మాదిరిగానే చదువుకుంటూ, ఆడుకుంటూ ఎదుగుతోందని తెలిపారు. ఆ సమయంలో అందిన సహాయాన్ని జీవితాంతం మరిచిపోలేమని పేర్కొన్నారు. కుటుంబానికి ఎంతో కీలక సమయంలో అందిన వైద్య సేవల వల్లే తమ కుమార్తె జీవితం నిలిచిందని భావోద్వేగంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారి ధన్సికను ఆప్యాయంగా పలకరించిన జగన్, ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.



ప్రస్తుతం ఆరోగ్యం బాగుందని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని చిన్నారిని ప్రోత్సహించారు. తల్లిదండ్రులతో కొద్దిసేపు మాట్లాడి కుటుంబ పరిస్థితులను కూడా తెలుసుకున్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

**అమరావతి, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పోలీస్ శాఖలో స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల నియామకాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) సవరిస్తూ నూతన ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హోంగార్డులకు పెద్ద ఊరటనిచ్చింది. పోలీస్ రవాణా సంస్థ (ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) పరిధిలో 198 స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియ నుంచే హోంగార్డులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ అమలులోకి రానుంది. నూతన రిజర్వేషన్ విధానం ద్వారా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలనుకుంటున్న అర్హులైన హోంగార్డులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హోంగార్డుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## వైసీపీకి గుడ్‌బై.. జనసేనలోకి కీలక నేతలు

**పవన్ కల్యాణ్ సమక్షంలో యనమల కృష్ణుడు, నవీన్ నిశ్చల్ తదితరుల చేరిక**





**మంగళగిరి, రాజధాని వాయిస్** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేనలోకి చేరికలు కొనసాగుతు న్నాయి. వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు, కాంగ్రెస్ నాయకురాలు శుక్రవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తుని నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత యనమల కృష్ణుడు, హిందూపురం సీనియర్ నాయకుడు నవీన్ నిశ్చల్ జనసేనలో చేరారు. వీరితో పాటు ఏలూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ పీవీఎల్ఎన్ నరసింహరాజు, కందుకూరు, సర్వేపల్లి, కనిగిరి నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి తదితరులు జనసేన కండువా కప్పుకున్నారు. తునికి చెందిన పోలినాటి శేషగిరిరావు, తణుకు నుంచి దిరిశాల కృష్ణ శ్రీనివాస్, శ్రీకాళహస్తికి చెందిన సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరి, ముమ్మిడివరం మాజీ ఏఎంసీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, నరసరావుపేటకు చెందిన ఏలూరి ప్రసాద్ తదితరులు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కొత్తగా చేరిన నాయకులకు సూచించారు. అందరినీ కలుపుకొని సమష్టిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనలో కొనసాగుతున్న చేరికలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

## 'బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు': అమిత్ షా

**యూపీలో రక్షణ రంగ ఉత్పత్తులకు ఊతం.. మేక్ ఇన్ ఇండియాతో దేశ ఆర్థిక ప్రగతి**

నోయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని పేర్కొన్నారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను ధ్వంసం చేసిన విషయాన్ని అమిత్ షా గుర్తు చేశారు. 2017 తర్వాత భాజపా ప్రభుత్వ హయాంలో ఉత్తర్‌ప్రదేశ్ గణనీయమైన ప్రగతి సాధిస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా భారత్ స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని షా తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని ఆయన ప్రశంసించారు. గతంలో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన ప్రజలకు ఇప్పుడు రాష్ట్రంలోనే అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఒకప్పుడు నేరపూరిత వాతావరణానికి పేరొందిన రాష్ట్రం.. ప్రస్తుతం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహనాల తయారీ, వైద్య పరికరాల ఉత్పత్తి వంటి రంగాల్లో ముందుకు సాగుతోందని అన్నారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం సెప్టెంబర్ 25న ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని అమిత్ షా గుర్తు చేశారు.



## ఫార్మా రంగంలో పెట్టుబడులు పెట్టండి

**క్లస్టర్ మోడల్ లో ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి**
**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రత్యేకత**
**అహ్మదాబాద్ లో ఫార్మా రంగంపై రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్**
**నక్కపల్లిలో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ లో పెట్టుబడులకు ఆహ్వానం**



**అహ్మదాబాద్, రాజధాని వాయిస్ :** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026 - ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో ఫార్మా రంగంపై అహ్మదాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రజాప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ గురించి మంత్రి వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఫార్మాస్యూటికల్ తయారీ, ఔషధ ఎగుమతులు, ఆర్ అండ్ డీ, మౌలిక వసతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ భారత ఫార్మా రంగ అభివృద్ధికి ఏపీ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోంది. 2030 నాటికి భారత ఫార్మా మార్కెట్ 130 బిలియన్ డాలర్ల దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏపీ భారతదేశంలో 3వ అతిపెద్ద ఔషధ ఎగుమతిదారుగా ఉంది. ప్రపంచ ఫార్మసీ మార్కెట్ విలువ 60 బిలియన్ డాలర్లు కాగా.. ప్రపంచ సరఫరాలో భారతదేశ వాటా 20%గా ఉంది. 2030 నాటికి పేటెంట్ గడువు ముగియనున్న ఔషధాల విలువ 251 బిలియన్ డాలర్లుగా ఉంది. 11.05 బిలియన్ డాలర్ల విలువతో భారతదేశ టాప్-5 ఫార్మా రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

**నక్కపల్లిలో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ లో పెట్టుబడులకు ఆహ్వానం**

అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం ప్రాంతాల్లో 4 ఫార్మాస్యూటికల్ క్లస్టర్లను అభివృద్ధి చేయడం జరుగుతోంది. విశాఖపట్నం భారతదేశపు ప్రముఖ మెడికల్ టెక్నాలజీ పార్క్ ఏఎంటీజెడ్ (AMTZ) కు కేంద్రంగా ఉంది. 6 ఆపరేషనల్ పోర్టులు, 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఉన్నాయి. నక్కపల్లి వద్ద 2,000 ఎకరాల బల్క్ డ్రగ్ పార్క్ మొదటి దశ పూర్తైంది. నక్కపల్లి ఫార్మా పార్క్‌కు విస్తారమైన భూమి, పోర్ట్ కనెక్టివిటీ, తక్కువ నిర్వహణ వ్యయాలు, బలమైన ఫార్మా ఎకోసిస్టమ్ ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ మద్దతు, పెట్టుబడి రాయితీలు ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. అన్ని అనుకూలతలు ఉన్న బల్క్ డ్రగ్ పార్క్ లో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సాగా లైఫ్ సైన్సెస్ డైరెక్టర్, ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐడీఎంఏ) నేషనల్ ప్రెసిడెంట్ విరంచి షా, జైడస్ గ్రూప్ సీనియర్ లీడర్ డా.గణేష్ నాయక్, స్వర్ణిమ్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ రిషబ్ గయప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఆది రిషబ్ జైన్, క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ ఛైర్మన్ డా.రాజీవ్ ఆర్.మోదీ, ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ ప్రెసిడెంట్ డా.దీపక్ గోండాలియా, జైడస్ ఫార్మేజ్ సీనియర్ ప్రొఫెషనల్ కపిల్ రజనీకాంత్ ఆచార్య, స్వర్ణిమ్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ డైరెక్టర్ జనరల్ డా.రాగిన్ షా, స్టాలియన్ లేబరేటరీస్ ప్రతినిధి హితేష్ ఆచార్య, నేహ లైఫ్ సైన్సెస్ ప్రతినిధి జతిన్ గాంధీ, సీఎస్ఐఆర్-సీఎస్ఎంసీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

## రిగ్గింగ్ జరుగుతోందనుకుంటే.. ఎన్నికలకు దూరంగా ఉండండి



**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు భావిస్తే.. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుందనేది ముమ్మాటికీ నిజమేనని ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాలు ఎన్నికల్లో పాల్గొనడంతో.. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భావన ప్రజల్లో కలుగుతోందన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని పదేపదే ఆరోపిస్తున్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు ఎందుకు పోటీ చేస్తున్నాయని ప్రశ్నించారు. "మీరు ఎన్నికల్లో పోటీ చేయకపోతే మీ ఉనికికే ముప్పు వాటిల్లుతుందనే భయంతో పోటీ చేస్తుండొచ్చు. కానీ ఓట్లు దొంగిలిస్తున్నప్పుడు.. మీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభపెడుతున్నప్పుడు.. మీ పార్టీలు చీలిపోతున్నప్పుడు.. మీరు ఇంకా ఎలాంటి ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు?. ఆట మోసపూరితమైందని చెబుతున్నప్పుడు.. దానిని కొనసాగించడం తప్పు. ఇప్పటికైనా ఇటువంటి మోసపూరిత ఎన్నికల్లో పోటీ చేయడం ఆపండి. రాజకీయ మనుగడకు కాకుండా.. దేశంలోని ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వండి' అని అభిజీత్ సూచించారు.

## డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా చర్యలు



**అమరావతి, రాజధాని వాయిస్ :** మాదకద్రవ్యాల నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలను సమన్వయంతో అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఈగల్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును ఛేదించడంతో పాటు అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. నేరస్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు ఎలాంటి స్థానం లేదనే సందేశాన్ని ప్రభుత్వం స్పష్టంగా ఇస్తోందన్నారు. యువత భవిష్యత్తును కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అనిత అన్నారు. విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కుటుంబ సభ్యులు కూడా అప్రమత్తంగా ఉండి యువతను సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని హోంమంత్రి పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేస్తేనే డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలించగలమని అభిప్రాయపడ్డారు. ప్రజలు, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం సమిష్టి కృషితో రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చవచ్చని తెలిపారు. మార్చి 2027 నాటికి డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందని అనిత స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ వ్యాపారంపై నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టి మాదకద్రవ్యాల నియంత్రణను మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని హోంమంత్రి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం నుంచి సమాజాన్ని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అనిత స్పష్టం చేశారు.

## అమరావతి భూసమీకరణ రైతులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్..

**అమరావతి, రాజధాని వాయిస్ :** ఏపీలో ప్రాజెక్టుల కోసం భూసమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన ఎల్‌పీఎస్ రైతులకు యాన్యుటీ చెల్లింపులు చేసేందుకు ఆమోదం తెలిపింది.

ఈ నిర్ణయం ప్రకారం 1,304 మంది అర్హులైన భూసమీకరణ రైతులకు మొత్తం రూ.5.04 కోట్ల మేర యాన్యుటీ చెల్లింపులను ప్రభుత్వం ధ్రువీకరించింది. డ్రైల్యాండ్ భూములకు ఏడాదికి రూ.40 వేల చొప్పున, జరీబు భూములకు ఏడాదికి రూ.60 వేల చొప్పున యాన్యుటీ చెల్లించనున్నారు. ఎకరం లోపు భూమిని ఇచ్చిన రైతులకు కూడా ఎకరం భూమికి వర్తించే విధంగా 10 సంవత్సరాల పాటు యాన్యుటీ ప్రయోజనం అందనుంది. 2025 డిసెంబర్ 2 నాటికి భూ యాజమాన్యం నిర్ధారణ పొందిన అర్హులైన రైతులకే ఈ నిర్ణయం వర్తించనుంది. అమరావతి పరిధిలోని ఏడు నోటిఫైడ్ గ్రామాలకు చెందిన ఎల్‌పీఎస్ రైతులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. యాన్యుటీ చెల్లింపులకు సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. దీంతో ఎకరం కంటే తక్కువ భూమిని భూసమీకరణకు ఇచ్చిన అర్హులైన రైతులకు కూడా యాన్యుటీ ప్రయోజనం అవకాశం ఏర్పడింది.

## ఏపీ పొగాకు రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

దిల్లీ, **రాజధాని వాయిస్** ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు భారీ ఊరట కల్పించేలా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్‌సీవీ పొగాకు ప్రతి బార్న్‌కు రూ.50 వేలు వడ్డీ లేని రుణం మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులను ఆదుకునేందుకు.. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల భారం నుంచి పొగాకు రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని నిర్ణయించినట్లు కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. పొగాకు రైతుల సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. గత రెండు నెలలుగా జరిగిన చర్చల అనంతరం కేంద్ర ప్రభుత్వం ఈమేరకు కీలక నిర్ణయం తీసుకుంది.

## వైకాపా నేతల నుంచి ప్రాణహాని ఉంది: ఈడీకి తెలిపిన సునీల్ యాదవ్

**హైదరాబాద్,రాజధాని వాయిస్** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ2 నిందితుడు సునీల్ యాదవ్‌ను వరుసగా రెండో రోజు ఈడీ అధికారులు విచారించారు. ఇవాళ నాలుగు గంటల పాటు ఈడీ అతడిని విచారించింది. ప్రధానంగా సునీల్ యాదవ్‌తో ఏ1 నిందితుడు గంగిరెడ్డి, ఏ3 నిందితుడు ఉమా శంకర్‌రెడ్డి మధ్య ఫోన్ కాల్స్‌పై ప్రశ్నించినట్లు సమాచారం. గూగుల్ టేక్ అవుట్ వివరాలు ముందు పెట్టి ఈడీ విచారించినట్లు తెలుస్తోంది. వివేకా హత్య జరిగిన సమయంలో తాను ఇంట్లో ఉన్నానని సునీల్ ఈడీకి వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. వైకాపా నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఈడీ అధికారులకు సునీల్ చెప్పినట్లు తెలుస్తోంది. సునీల్ యాదవ్ ఆర్థిక లావాదేవీలు, అతని భార్య బ్యాంకు ఖాతాలకు సంబంధించి కూడా ప్రశ్నించినట్లు సమాచారం. వివేకా హత్య కేసులో పెద్ద ఎత్తున మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ భావిస్తున్నందున ఈ కోణంలో లోతుగా విచారణ జరుపుతోంది.

## ఏపీలో డిజివెరిఫై ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రభుత్వ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అమరావతి, **రాజధాని వాయిస్** రాష్ట్రంలో వివిధ అవసరాల కోసం ధ్రువ పత్రాల తనిఖీలకు ఇకపై ఏపీ డిజివెరిఫై ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశించింది. విద్యా సంస్థల ప్రవేశాల దగ్గర నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను పొందేందుకు వినియోగించే సర్టిఫికెట్లను ఇకపై మాన్యువల్ వెరిఫికేషన్ కాకుండా ఈ ప్లాట్‌ఫామ్ ద్వారానే జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. డిజిటల్ రూపంలోనే సర్టిఫికెట్లు జారీ అవుతున్న దృష్ట్యా.. ఫిజికల్ కాపీలు కాకుండా ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ధ్రువీకరణ పూర్తి చేయాలని, దాని వల్ల నకిలీలకు అవకాశం లేకుండా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నేరుగా చూసేందుకు, వెంటనే నిర్ధరణకు ఉపకరిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్లు అన్నింటిని వెరిఫై చేయడానికి దీనినే ఉపయోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీ డిజివెరిఫై ప్లాట్‌ఫామ్‌లో లేని ధ్రువపత్రాలను మాత్రమే మాన్యువల్‌గా పరిశీలించేందుకు అనుమతిస్తామని తెలిపారు.

## ఈ సీజన్‌లో తొలిసారి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

**విజయవాడ, రాజధాని వాయిస్** కృష్ణానదికి జలకళ వచ్చింది. ఈ సీజన్‌లో తొలిసారిగా ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద ప్రవాహం చేరుతోంది. వాయుగుండం ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువన ఉన్న వాగులు పొంగి.. ప్రకాశం బ్యారేజీ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం 55 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, దిగువకు 47 వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2,500, తూర్పు డెల్టాకు 5 వేల క్యూసెక్కులు, గుంటూరు ఛానెల్‌కు 250 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక అల్లాడుతున్న రైతాంగానికి.. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు ఊరటనిచ్చాయి. బుడమేరు, కట్టలేరు, మున్నేరు, పాములేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నాలుగు వాగుల నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది.

## దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు.. పలుచోట్ల జలఫిరంగుల ప్రయోగం

దిల్లీ: **రాజధాని వాయిస్** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో దిల్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను తొలగించుకొని ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే చూస్తూ కూర్చోబోమని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రూపంలో ఉన్న మాస్క్‌లను ధరించి.. యూత్ కాంగ్రెస్ నేతలు దిల్లీలో ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్‌ను పోలీసులు నిర్బంధించారు. బిహార్ రాజధాని పట్నా, చండీగఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు కోల్‌కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి.

# కూటమి సమన్వయమే విజయానికి బాట: అనిత

**నక్కపల్లి, రాజధాని వాయిస్ :** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నక్కపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సన్నాహాలపై సమీక్ష నిర్వహించారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, కార్యకర్తల పాత్ర వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. స్థానిక ఎన్నికలు కేవలం రాజకీయ పోటీ మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశంగా భావించాలని ఆమె సూచించారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని స్థాయిల నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ఒక ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తోందని అనిత పేర్కొన్నారు. కూటమిలోని మూడు పార్టీల లక్ష్యం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధేనని స్పష్టం చేశారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి విభేదాలకు తావు లేకుండా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కూటమి నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని హోంమంత్రి సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పులను వివరించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి దోహదపడాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే విజయానికి పునాది అవుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులకు పూర్తి సహకారం అందించాలని ఆమె పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయాల కంటే కూటమి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రచార కార్యక్రమాలు సమన్వయంతో నిర్వహించాలని, ప్రతి కార్యకర్త పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా వ్యవహరించాలని కోరారు. క్రమశిక్షణతో కూడిన కార్యాచరణ విజయాన్ని సులభతరం చేస్తుందని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రధాన లక్ష్యమని అనిత స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలతో పాటు వాటి అమలుపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రజల విశ్వాసం పొందేందుకు నాయకులు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని



పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక రాజకీయ పరిస్థితులు, ఎన్నికల సన్నాహాలు, కూటమి బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎన్నికలను సమిష్టిగా ఎదుర్కొని విజయాన్ని సాధించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల్లో మెరుగైన ఫలితాలు సాధించి కూటమి బలాన్ని మరింత పెంచాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

## తుఫాన్ బాధిత రైతులకు అండగా నిలవాలి



**చీపురుపల్లి, రాజధాని వాయిస్ :** తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి మండలం పెరిపి గ్రామాన్ని సందర్శించారు. పార్టీ నాయకులు ఇప్పిలి అనంత్, మీసాల వరాల నాయుడుతో కలిసి పంట పొలాల్లో పర్యటించి రైతుల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. భారీ వర్షాలు, గాలుల కారణంగా దెబ్బతిన్న పంటలను చూసి రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పెరిపి గ్రామంలో పలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన చంద్రశేఖర్, రైతుల నుంచి పంట నష్టానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరి, ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో తుఫాన్ ప్రభావం మరింత భారంగా మారిందని వారు తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రశేఖర్, తుఫాన్ ప్రభావంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవిస్తున్న కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం తగిన స్పందన చూపడం లేదని చంద్రశేఖర్ విమర్శించారు. నష్టపోయిన ప్రాంతాల్లో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు.వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రైతులను ఆదుకోవడం అత్యంత ముఖ్యమని చంద్రశేఖర్ అన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు అవసరమైన ఇన్‌పుట్ సబ్సిడీలు, ఇతర సహాయ కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. బ్యాంకు రుణాల విషయంలో కూడా రైతులకు ఊరట కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పంట నష్టం వివరాలను నాయకులకు వివరించిన రైతులు ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చంద్రశేఖర్ తెలిపారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

**నెల్లూరు, రాజధాని వాయిస్ :** నెల్లూరు జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, త్వరలో జరగనున్న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లతో సమావేశమయ్యారు. నెల్లూరు సంతపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని భద్రతా పరిస్థితులు, ప్రజా కార్యక్రమాల నిర్వహణ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. జిల్లా పరిపాలన, పోలీసు శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎస్పీ అజిత వేజెండ్ల మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి జిల్లాలో అమలవుతున్న శాంతిభద్రతల చర్యలపై వివరించారు. జిల్లాలో చట్టవ్యవస్థ పరిస్థితి,



భద్రతా ఏర్పాట్లు, ప్రజా రక్షణకు చేపడుతున్న చర్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల్లో పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రత్యేక నిఘా చర్యల గురించి కూడా వివరించినట్లు సమాచారం. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు.ఈ నెల 29న వరికుంటపాడు మండలం రామాపురంలో నిర్వహించనున్న 'పల్లె పండుగ--3.0' కార్యక్రమ ఏర్పాట్లపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొననున్న ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కార్యక్రమ ప్రాంగణం, రాకపోకల మార్గాలు, వాహనాల పార్కింగ్, ప్రజల నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆనం రామనారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా సిబ్బంది మోహరింపు, అత్యవసర సేవల అందుబాటుపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారం, నేరాల నియంత్రణ, భద్రతా చర్యల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.సమావేశం అనంతరం నెల్లూరు పోలీస్ శిక్షణ కళాశాలలో రేపు జరగనున్న దీక్షాంత్ పరేడ్ కార్యక్రమానికి హాజరు కావాలని ఎస్పీ అజిత వేజెండ్ల మంత్రిని ఆహ్వానించారు. పోలీసు శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బంది పాల్గొనే ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను ఎస్పీ వివరించారు. జిల్లాలో పోలీసు శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. సమావేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సేవల మెరుగుదల, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం వంటి అంశాలపై అధికారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం

**- లక్కవలస, మరువాడ గ్రామాల్లో మంత్రి పర్యటన**
**- నష్టపోయిన కుటుంబాలకు ధైర్యం చెప్పిన అచ్చన్నాయుడు**
**- తక్షణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు**

**సంతబొమ్మాళి, రాజధాని వాయిస్ :** తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన సంతబొమ్మాళి మండలంలోని లక్కవలస, మరువాడ గ్రామాల్లో రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు పర్యటించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లక్కవలస గ్రామంలో తుఫాన్ ధాటికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన మంత్రి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇళ్ల నష్టం కారణంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించారు. దెబ్బతిన్న ఇళ్ల వివరాలను వెంటనే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి కొత్త ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డీఓకు సూచించారు.తుఫాన్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం కోసం మంత్రి గ్రామస్తులతో సమావేశమయ్యారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, నివాస సదుపాయాలకు సంబంధించిన ఇబ్బందులను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపడుతుందని మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. అనంతరం మరువాడ గ్రామంలో నీట మునిగిన ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. గ్రామ ప్రజలతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను అంచనా వేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో నివారణ చర్యలు మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.వ్యవసాయ భూములు, పంటలకు జరిగిన నష్టాన్ని కూడా అధికారులు సమగ్రంగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం జరిగినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. పంట నష్టం, గృహ నష్టం, మౌలిక సదుపాయాల నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని





ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అచ్చన్నాయుడు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలిచి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

# ఎన్‌హెచ్-167ఏ విస్తరణ పనులకు శంకుస్థాపన

## - మంత్రి గొట్టిపాటి రవికుమార్





**కేసానుపల్లి, సెప్టెంబర్ 25రాజధాని వాయిస్ :** చిలకలూరిపేట--నకరికల్లు జాతీయ రహదారి-167ఏ విస్తరణ పనులకు కేసానుపల్లిలో శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి. సంజనా సింహతో కలిసి పాల్గొన్నారు. రహదారి విస్తరణకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరించడంతో పాటు భూసేకరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ 38 కిలోమీటర్ల మేర చేపడుతున్న ఈ జాతీయ రహదారి విస్తరణ పనులను రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో రహదారుల నిర్మాణం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని చెప్పారు. నిర్ణీత గడువులో నాణ్యతతో కూడిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పారదర్శక విధానంలో భూముల సేకరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల అభిప్రాయాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. ఎన్‌హెచ్-167ఏ పూర్తయిన తర్వాత బాపట్ల--సూర్యలంక ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం లభిస్తుందని మంత్రి వివరించారు. నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో పర్యాటక, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. మెరుగైన రవాణా సదుపాయాల వల్ల కొత్త పెట్టుబడులు ఆకర్షితమవడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం కావడంతో రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు మరింత వేగవంతం కావడానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. ఎన్‌హెచ్-167ఏ విస్తరణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి పనులపై డీఆర్సీ సమీక్ష

- ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యల చర్చ
- సాగునీరు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు
- సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి




**నరసరావుపేట, రాజధాని వాయిస్ :** నరసరావుపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా చర్చించారు. రహదారులు, తాగునీటి పథకాలు, వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు స్థితిగతులను అధికారులు వివరించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వవద్దని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొనే అవకాశమున్న వర్షాభావ పరిస్థితులపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాగునీటి వనరుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగంపై ప్రభావం తగ్గించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నీటి కొరత ఏర్పడే ప్రాంతాలను ముందు గానే గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనుల అమలులో వేగం పెంచాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లాలోని పలు అభివృద్ధి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష
- ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించాలని సూచన
- హార్టికల్చర్ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపు





**పుట్టావారిపాలెం, రాజధాని వాయిస్ :** పుట్టావారిపాలెం క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతులకు అందుతున్న సేవలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, పంటల సాగు పరిస్థితులపై అధికారులతో చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సీజన్‌లో ఎలాంటి కొరతలు తలెత్తకుండా అవసరమైన నిల్వలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రైతులు అవసరమైన సమయంలో వ్యవసాయ సామగ్రి పొందేలా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం రైతులతో మమేకమై సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. వాతావరణ మార్పులు వ్యవసాయంపై చూపే ప్రభావాలను వివరించి, పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలో రైతులకు సూచనలు అందించాలని అన్నారు. శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహిస్తూ వ్యవసాయ విస్తరణ సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడంలో రైతులకు సహకరించాలని చెప్పారు. హార్టికల్చర్ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహక పథకాలు, సాంకేతిక సహాయాన్ని రైతులకు పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. హార్టికల్చర్ రంగ అభివృద్ధి ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గ్రీన్ కవర్ పెంపు లక్ష్యాలను సాధించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకం, పచ్చదనం విస్తరణ కార్యక్రమాల్లో రైతుల భాగస్వామ్యాన్ని పెంచాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు మెరుగైన సహజ వనరులను అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిరంతరం అండగా నిలిచి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, రైతుల ఆదాయ వృద్ధి, పర్యావరణ పరిరక్షణ అనే మూడు లక్ష్యాలతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

# పోలేరమ్మ జాతరకు ఘన ఏర్పాట్లు



**నెల్లూరు, రాజధాని వాయిస్ :** నెల్లూరు జిల్లా వెంకటగిరిలో గ్రామశక్తి స్వరూపిణి శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి అక్టోబర్ 1 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జాతరకు ప్రత్యేక ఆహ్వానం అందించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, దేవస్థాన పాలక మండలి సభ్యులు, పట్టణ ప్రముఖులు, దేవాదాయ శాఖ అధికారులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి జాతర వెంకటగిరి ప్రాంతంలో అత్యంత ప్రాచీనమైన, విశిష్టమైన ఆధ్యాత్మిక ఉత్సవంగా గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ మహోత్సవాన్ని ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. జాతర నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో పాటు దేవస్థాన ప్రతినిధులు, అధికారులు మంత్రిని కలిసి వివరించారు. భక్తుల రాకపోకలు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. జాతర రోజుల్లో పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 1న జరిగే అమ్మవారి నిలుపు, నగరోత్సవం, నిమజ్జన కార్యక్రమాలు జాతరలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున తాను స్వయంగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సంప్రదాయబద్ధంగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో సుఖశాంతులు, సుభిక్షం నెలకొనాలని ప్రార్థించారు. గ్రామీణ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పోలేరమ్మ జాతర ప్రజల విశ్వాసాలకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. భక్తులు జాతర మహోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అధికారులు, దేవస్థాన సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి జాతరను ఘన విజయవంతం చేయాలని సూచించారు. వెంకటగిరి పోలేరమ్మ జాతర రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో ఒకటిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# భారత్‌ను ప్రపంచ స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దాలి

**గుంటూరు,రాజధాని వాయిస్ :**గుంటూరు: విద్యార్థులు వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించి, దేశానికి అవసరమైన సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రపంచ దేశాలు మెచ్చే విధంగా భారతదేశాన్ని ప్రపంచస్థాయి స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆర్.వి.ఆర్. & జె.సి. ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన సందర్భంగా ఆయన కళాశాలలోని డి.ఎస్.టి.-ఆర్.జె.ఈ. నెస్ట్ ఇంక్యుబేషన్ సెంటర్, ఇన్నోవేషన్ సెంటర్, ఏఐసీటీఈ-ఐడియా ల్యాబ్ తదితర పరిశోధనా, సాంకేతిక కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు చేపడుతున్న ప్రాజెక్టులు, పరిశోధనలు, ప్రయోగాలు, వినూత్న ఆవిష్కరణలను పరిశీలించి, విద్యార్థులు మరియు నిపుణులతో వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక విద్యను కేవలం ఉద్యోగం సాధించేందుకు మాత్రమే పరిమితం

చేయకుండా, తమ జ్ఞానం, నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలను ఉపయోగించి ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణలుగా మలచి, అంకుర పరిశ్రమలను స్థాపించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. స్టార్టప్‌లు, ఇన్నోవేషన్‌లు, పరిశోధనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులను ఇన్నోవేటర్లు, ఎంట్రప్రెన్యూర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు ఆర్.వి.ఆర్. & జె.సి. ఇంజినీరింగ్ కళాశాలలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక, పరిశోధనా, ఇంక్యుబేషన్ వసతులు అభినందనీయమని డా. పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

# పర్యావరణ పరిరక్షణకు 'ట్రీ బ్యాంక్'



**గుంటూరు, రాజధాని వాయిస్ :** పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ యువతకు సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించ డంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఏపీ గ్రీన్ ఛైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా--2026లో భాగంగా గుంటూరు లామ్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంతాలకు కీలకమైన ఉపాధి ఆధారాలుగా నిలుస్తాయని నాగబాబు అన్నారు. గ్రామీణ యువత ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి ఆధారిత జీవనోపాధులు, నైపుణ్య ఆధారిత కార్యక్రమాలను స్వయం ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు.

**ట్రీ బ్యాంక్, నర్సరీ ఏర్పాటుకుప్రతిపాదన**

పర్యావరణ కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం, లామ్‌తో ఏపీ గ్రీన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్యలు చేపట్టినట్లు నాగబాబు తెలిపారు. కేవీకే పరిధిలో భూమిని అందుబాటులోకి తీసుకుని ట్రీ బ్యాంక్, నర్సరీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. నర్సరీ ద్వారా వివిధ ప్రాంతాల్లో చేపట్టే వృక్షారోపణ కార్యక్రమాలకు అవసరమైన నాణ్యమైన మొక్కలను పెంచి, సంరక్షించి అందుబాటులో ఉంచవచ్చన్నారు.

**తేనెటీగల పెంపకంపై శిక్షణ పరిశీలన**

కార్యక్రమంలో భాగంగా గ్రామీణ యువతకు అందిస్తున్న స్టింగ్‌లెస్ బీ, తేనెటీగల పెంపకం శిక్షణను నాగబాబు పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి ఉపాధి అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల ద్వారా గ్రామీణ యువతకు స్వయం ఉపాధి, అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీన్ సీఈవో బి.ఎన్.ఎన్. మూర్తి, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు, గుంటూరు డీఎఫ్ఓ ఎం. హిమ శైలజ, కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ డా. ఎం. యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ పరిధిలోని 76 వార్డుల ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

**గుంటూరు, రాజధాని వాయిస్ :**గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 76 వార్డులకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన సర్క్యులర్ నెం. 526/SEC-F1/2026, తేది: 21-09-2026 ప్రకారం సిద్ధం చేయడం జరిగిందని కమిషనర్ మరియు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఈ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా (Annexure-I) గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, అన్ని వార్డు కార్యాలయాలు మరియు నగరంలోని ముఖ్య ప్రదేశాలలో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచబడిందన్నారు.? సదరు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉన్నట్లయితే, సంబంధిత వ్యక్తులు తమ దరఖాస్తులను కార్యాలయ పని వేళల్లో 26-09-2026 నాటికి లేదా ఆలోగా కమిషనర్ కార్యాలయంలో అందజేయవచ్చని తెలియజేశారు.

